క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



నాగాయలంక: మండలంలో ఎరువుల దుకాణాలలో బయో స్టిములెంట్‌లపై శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నాగాయలంక, తలగడదీవి, గణపేశ్వరం, పర్రచివర గ్రామాల్లోని తదితర ఎరువుల షాపులలో మొవ్వ వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఎస్.శ్యామల, స్థానిక ఏఓ అన్నలూరి సంజీవకుమార్ ఈ తనిఖీలు నిర్వహించారు. ఎక్‌నాలెడ్జ్ మెంట్ జీ–2, జీ–3లు లేకుండా బయో ఉత్పత్తుల అమ్మకాలు చట్ట విరుద్ధమన్నారు. అటువంటి అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అతిక్రమిస్తే స్టాక్‌కు స్టాప్ సేల్స్ ఇస్తామని ఎరువుల డీలర్‌లను హెచ్చరించినట్లు ఏడీఏ చెప్పారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లు, లైసెన్స్‌లు తనిఖీ చేశారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాల కారణంగా రూ.30 వేల విలువైన బయోలకు స్టాప్ సేల్స్ ఆర్డర్ జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కాసానగర్(మోపిదేవి): 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా, 108 వాహనంలో మచిలీపట్నం హాస్పటల్‌కు తరలించారు. స్థానికుల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని పెదప్రోలు శివారు కాసానగర్ 216 జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ కొనడంతో ఒకవాహనం పైనున్న ఇద్దరి యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. కె. కొత్తపాలెంకు చెందిన కొక్కిలిగడ్డ ఏసోబు, సీతారామయ్యల ద్విచక్రవాహనాన్ని యార్లగడ్డకు చెందిన కంచర్ల విష్ణు వాహనం బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో ఏసోబు కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు ఉన్నత వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి




ఘంటసాల: ప్రతి ఒక్కరూ నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఫామ్ ఫాండ్స్ నిర్మాణ పనులను మండలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల గ్రామానికి చెందిన రావి సుధాకరరావు పశువుల చావిడి వద్ద, మల్లంపల్లిలో రాజులపాటి ధనకుటుంబరావు పొలంలో ఫామ్ ఫాండ్స్ నిర్మాణ పనులకు ఎంపీడీవో, పీఏసీఏస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధిహామి పథకం ద్వారా అర్హులైన వారికి ఫామ్ ఫాండ్స్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఏపీఓ రాజ్ కుమార్, టీఏ అలివేలు, సీవో బాలు, ఈవో అబ్దుల్ నయూమ్, రావి సుజాత, ఉపాధి హామి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర కృషితో అద్వితీయంగా ఎదగాలన్నారు. కుగ్రామంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన డాక్టర్ సతీష్‌రెడ్డి భారతదేశ రక్షణ పరిశోధన రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన గోడ పత్రిక, రాత పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డి.ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా. సీడీసీ సభ్యుడు తోట శ్యాంకిశోర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూరగం జగన్మోహనరావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారానికి మెరైన్ ఏఎస్‌ఐ ఎంపిక



కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే ఉగాది పురస్కారాల్లో సేవా పతకానికి పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే ఏఎస్ఐ పోతురాజుకు ఎంపికయ్యారు. పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాల్లో పోతురాజు భాగస్వాములయ్యారు. సేవా పతకానికి ఎంపికైన పోతురాజును మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐలు ఉజ్వల్‌కుమార్, పూర్ణమాధురి, రైటర్ రెహ్మాన్ జానీ, సిబ్బంది అభినందించారు. ఉగాది నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు.

అందుకోసమేనా..

ఆక్రమణల తొలగింపు

- ప్రహసనంగా ఆక్రమణల తొలగింపు
- ఆక్రమణలు తొలగించిన స్థానంలో కూటమి నాయకుల ఆక్రమణ
- తొలగింపులో పక్షపాతం చూపుతున్న అధికారులు



దిమ్మల సెంటర్లో రేకుల షెడ్ తొలగించిన స్థలంలో జనసేన నాయకులు నిర్మించిన ప్రహరీ

మచిలీపట్నంటౌన్: నగరంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపు ఓ ప్రహసనంలా మారింది. తొలగింపులో పేదలకు ఓ న్యాయం.. పెద్దలకు ఓ న్యాయం అన్న చందంగా నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో జీవనాధారమైన బడ్డీలను, నిర్మాణాలను కోల్పోయిన చిరు వ్యాపారులు లబోదిబోమంటుంటే.. కూటమి నాయకుల ఆశీస్సులు ఉన్న వారి ఆక్రమణల తొలగింపులో అధికారులు పలు ప్రాంతాల్లో పక్షపాతం చూపుతున్నారు.

పక్షపాతానికి నిదర్శనాలివీ..

నగరపాలక సంస్థ అధికారులు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఆక్రమణల తొలగింపులో పక్షపాత ధోరణికి పాల్పడుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. పలు ప్రాంతాల్లో తొలగింపులో చోటు చేసుకున్న పరిస్థితులే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు.

- నగరంలోని ఈడేపల్లిరోడ్డులో ఫైర్‌స్టేషన్ పక్కన డ్రెయిన్‌పై బడ్డీలను అధికారులు తొలగించారు. వాటి పక్కనే ఓ టీడీపీ నాయకుడి కల్యాణ మండపం ముందు డ్రెయిన్‌ను పూర్తిగా మూసేసి శ్లాబు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోలేదు.
- లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి విజయవాడ బైపాస్ రోడ్డులో డ్రెయిన్‌పై ఆక్రమణలు తొలగించిన అధికారులు ఆ ప్రాంతంలో ఓ జనసేన నాయకుని దుకాణాల సముదాయం డ్రెయిన్‌ను మూసేసి ఉన్నా పట్టించుకోలేదు.
- రామానాయుడుపేట సెంటర్‌లో ఓ జ్యూస్ షాపు డ్రెయిన్‌పైనే ఉన్నా.. కూటమి నాయకుల అండదండల కారణంగా తొలగించడం లేదు.
- ప్రధాన రహదారిలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఓ రెస్టారెంట్, కల్యాణ మండపం నిర్వాహకుడు ఫుట్‌పాత్‌పైనే మెట్లు ఏర్పాటు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం విశేషం.
- నాగపోతరావుసెంటర్‌లో ఓ జనసేన నాయకుడు తన బార్ ముందు డ్రెయిన్‌పై ఉన్న నిర్మాణాలు తొలగించవద్దని జేసీబీ తాళాలు లాక్కుని సిబ్బంది, అధికారులపై వాగ్వాదానికి దిగడంతో అక్కడి ఆక్రమణలను తొలగించకుండానే వదిలేశారు.
- వెంకటేశ్వర థియేటర్ పక్క సందులో ఓ హోటల్ వద్ద కూడా డ్రెయిన్‌పై ఆక్రమణను వదిలేసి పక్కన ఉన్న బడ్డీలను తొలగించడం ఆ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

ఇలా నగరంలో చాలా ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపులో అధికారులు కూటమి నేతల ఆదేశాలతో చూసీ చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అలా తొలగించారు.. ఇలా ఆక్రమించేశారు

నగరంలోని 11వ డివిజన్ దిమ్మల సెంటర్ ప్రాంతంలో ఇటీవల రోడ్డు మార్జిన్‌లోని ఆక్రమణలను తొలగించారు. ఆ ప్రాంతంలోని విజయ గణపతి దేవాలయం పక్కన గాడి లక్ష్మీనాగేంద్రమ్మ, ఆమె భర్త వెంకటకృష్ణారావు దాదాపు 25 ఏళ్ల పైబడే రేకుల షెడ్డు ఏర్పాటు చేసి చికెన్ దుకాణం కొనసాగిస్తున్నారు. తమ షెడ్డు తొలగించవద్దని 2018లో కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చిందని అందువల్ల తమ షెడ్డును కూల్చకుండా మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయినా లెక్కచేయని అధికారులు రెండు రోజుల క్రితం వారి షెడ్డును తొలగించారు. అయితే ఆ ప్రాంతానికి చెందిన జనసేన నాయకులు శుక్రవారం ఇదే స్థలానికి ప్రహరీ కట్టేసి గేటు పెట్టినా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై టీపీఓ శ్రీహరిప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఆక్రమణ తన దృష్టికి రాలేదని, పరిశీలించి కట్టిన ప్రహరీ తొలగిస్తామని చెప్పారు. ఇలా చాలా ప్రాంతాల్లో చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించడం ఆపై కూటమి నాయకులు వారి అనుయాయులతో మళ్లీ ఆక్రమించేస్తున్నారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కిట్టు



స్టార్ బ్యానర్స్ షాపును ప్రారంభిస్తున్న పేర్నికిట్టు చిత్రంలో డేవిడ్‌శామ్యూల్ తదితరులు

మచిలీపట్నంటౌన్: యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేసి జీవితంలో స్థిర పడాలని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని బచ్చుపేటలో వై.చైతన్య నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ బ్యానర్స్ షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ యువత చిన్న పరిశ్రమలను స్థాపించి వారు ఉపాధి పొంది, నలుగురికి ఉపాధి చూపించే స్థాయికి ఎదగాలన్నారు. అప్పుడే ఎవరికి వారు ఎదగటంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారన్నారు. స్టార్ బ్యానర్స్ షాప్‌ను ఏర్పాటు చేసిన చైతన్యను ఆయన అభినందించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు (జానీ), అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, నగర క్లస్టర్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి మాజీ సర్పంచ్ మందా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మారెడ్డి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నరసింహారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రమేష్ బాబు, పార్టీ నాయకులు

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని భావదేవరపల్లిలో చెరువులో దుక్కి దున్నే పనులకు వెళ్లి ట్రాక్టర్ తిరగబడి దుర్మరణం చెందిన ముమ్మారెడ్డి నరసింహారావు కుటుంబాన్ని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు శనివారం పరామర్శించారు. ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడిన ఉదంతం వివరాలను ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నరసింహారావు మృతి తీవ్ర విచారకరమంటూ తండ్రి ముమ్మారెడ్డి బెనర్జికి మనోధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన వెంట రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది చిన్నారి, సర్పంచ్ కైతేపల్లి రాజేంద్రప్రసాద్ (చంటి), తోట సాయిబాబు, ముమ్మారెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), భోగాది మురళి, మలిశెట్టి మధుసూదనరావు, తాణింకి వేణు, విశ్వనాథపల్లి సత్యనారాయణ, గుంటూరు సురేష్, మద్ది కొండలు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టండి

ఎంపీపీ సంగా మధుసూదనరావు



మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు కోరారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్యపై నాయకులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కంకటావ, ముక్కొల్లు, లేళ్లగరువు, రామానుజవత్తర్లపల్లి, తరకటూరు, చిట్టిగూడూరు గ్రామాల్లో నీటి సమస్య ఉందని, సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు అధికారులను కోరారు. దీనిపై స్పందించిన డీసీ చైర్మన్ లక్ష్మీనరసింహ స్వామి మాట్లాడుతూ వేసవి తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కప్పలదొడ్డి పాలెం ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు భయం గుప్పిట్లో విద్యాభ్యాసం చేస్తున్నారని, పాఠశాల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆకులమన్నాడు ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల లక్ష్మణరావు కోరారు. ఆకులమన్నాడు అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేకపోవడం వల్ల చిన్నారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచి మహ్మద్ రఫీ కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఎంపీడీఓ బి.రాజేశ్వరి, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు



కోడూరు: దివిసీమలోని పేరుగాంచిన పెదగుడుమోటు గ్రామంలోని శ్రీ బెంగాలీషా బాబావలి దర్గా వద్ద ఉరుసు మహోత్సవాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం బాబావారి సమాధి వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఎదురుగా జెండాలను నెలకొల్పి ఉరుసును ప్రారంభించారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ముస్లింలు కుటుంబాల సమేతంగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. బాబావారి సమాధిపై పచ్చని వస్త్రాలు కప్పి తమ మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ప్రాంగణంలో ఉన్న తమ పితృదేవతల సమాధుల వద్ద కూడా ప్రార్థనలు చేశారు. రాత్రికి ప్రత్యేక అశ్వంపై చందనోత్సవం, ఆదివారం ఉదయం దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

సకాలంలో బిల్లులు చెల్లిస్తే సర్‌చార్జీలు ఉండవు

చల్లపల్లి: మీటరు నుంచి విద్యుత్ బిల్లులను తీసిన తేదీ నుంచి 15 రోజుల లోపు వినియోగదారులు బిల్లులు చెల్లిస్తే తరువాత వచ్చే బిల్లులో సర్‌చార్జీలకు మినహాయింపు లభిస్తుందని విద్యుత్ శాఖ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా అంతరాయాలు ఉంటే సంబంధిత మండలాల ఏఈఈలకు తెలియజేయాలని సూచించారు.

నేడు మంగళాపురంలో విద్యుత్ నిలుపుదల

మండల పరిధిలోని మంగళాపురం గ్రామంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కృష్ణనాయక్ తెలిపారు. హైస్కూల్ వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు.

ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలికి ఆశీర్వచనం



మండలిని సన్మానిస్తున్న ఆలయ డీసీ శ్రీరామ వరప్రసాదరావు, తదితరులు

మోపిదేవి: అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత వేదపండితులు నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ, మణిదీప్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్ధు పవన్‌కుమార్‌శర్మ వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం భారీ గజమాలతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు మదుసూధనరావు, బర్మా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ నేటి నుంచి సంపటాలమ్మ గ్రామ సంచారం

చల్లపల్లి: గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి అమ్మవారు ఆదివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకూ గ్రామ సంచారం చేయనున్నట్లు ఆలయ వంశ పారంపర్య ప్రధాన అర్చకుడు చల్లపల్లి కోటేశ్వరరావు శనివారం తెలిపారు. తొలుత ఆదివారం ఆలయం నుంచి బయలుదేరి పడమరవీధిలోని తన పుట్టినిల్లు అయిన ప్రత్తిపాటివారి ఇంట నుంచి సంచారం ప్రారంభిస్తామని చెప్పారు. ఈ 8రోజుల్లో మంగళవారం తప్ప మిగిలిన రోజుల్లో పడమరవీధి వైపు, తూర్పువీధి వైపు, చల్లపల్లి నారాయణరావునగర్ వైపు ప్రతి ప్రాంతానికి మూడుసార్లు చొప్పున అమ్మవారు సంచారం చేస్తారని వివరించారు. చివరికి 31వ తేదీ సాయంత్రానికి అమ్మవారు ఆలయానికి చేరుకుంటారని తెలిపారు.

■ నీటి వనరులను రక్షించుకోవాలి

ఘంటసాల: మన భావితరాలకు, మన భవిష్యత్తు కోసం నీటి వనరులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ జల దినోత్సవం శనివారం నిర్వహించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవాలన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థినులు అంతర్జాతీయ నీటి దినోత్సవం చిత్రం వేసి ప్రదర్శించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రేవతి, డాక్టర్ బి.నవీన్, జె.యశ్వంత్ కుమార్, డాక్టర్ జి.కృష్ణవేణి, యువత పాల్గొన్నారు.

■ కుక్కర్ల పంపిణీ

గూడూరు: హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో అమ్మ ప్రాజెక్టు వాసవ్య మహిళా మండలి సహకారంతో పోలవరంలోని నిరుపేద కలంకారీ కార్మికులకు కుక్కర్లను శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా గ్రామంలోని కలంకారీ వర్కర్స్‌కు కుక్కర్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు అన్నం హరిరామకృష్ణ, కారుపర్తి శ్రీనివాస్, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, పలగాని మహేష్, బళ్ల సాయి పాల్గొన్నారు.

■ సంపద తయారీ కేంద్రాల పరిశీలన

మల్లంపల్లి(ఘంటసాల): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. మల్లంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఎంపీడీవో శనివారం పరిశీలించారు. క్లాప్ మిత్రల ద్వారా నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూపీసీలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఘంటసాల, ఘంటసాలపాలెం, చిట్టూర్పు, మల్లాయి చిట్టూరు, కొడాలి, కొత్తపల్లి, లంకపల్లి, శ్రీకాకుళం, చినకళ్లేపల్లి, మల్లంపల్లి గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు తడి పొడి చెత్త సేకరణ పనులను ఆయా కార్యదర్శులు పరిశీలించారు. టి.జయలక్ష్మి, బి.అర్జునరావు, ఎస్.శ్రీలక్ష్మి, జి.శిరీష, నాగమణి, సునంద, నాగ నాంచారమ్మ, శ్రీనివాసరావు, అబ్దుల్ నయూమ్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

మల్లంపల్లిలో గ్రామసభ

మల్లంపల్లిలో శనివారం జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో సుబ్బారావు పాల్గొని పీ–4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మల్లంపల్లి పంచాయతీ పరిధిలోని వాటర్ ట్యాంకు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు, ఈవో అబ్దుల్ నయూమ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

■ మార్జిన్లు రెండు వైపులా సర్వే చేయాలి

బంటుమిల్లి: బంటుమిల్లి బ్రాంచి కాలువ పరిధిలో రెండు వైపులా కట్టలు సర్వే చేయించి ఇరిగేషన్ భూముల ఆక్రమణలు తొలగించాలని కోరుతూ కాలువ పరిధిలోని రైతులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కాలువ పరిధిలో రెండు వైపులా కట్టల సరిహద్దుల్లో ఇరిగేషన్ భూములు ఉన్నాయి. సరిహద్దు రైతులు వీటిని ఆక్రమించారు. వీటిపై విచారించి రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలు తొలగించి చెట్లు నరికిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు తాహసీల్దార్ కే పూర్ణచంద్రరావు, ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మిలకు వినతిపత్రాలు అందజేశారు. మాజీ సర్పంచ్ ఆకునూరు శ్యాంసోన్, టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఇల్లూరి లీలాకృష్ణ, బలుసు శ్రీనివాసరావు, ఎండీ.రహ్మాన్, మేకా నాగరాజు, జోశ్యుల భాస్కరరావు తదితరులు ఉన్నారు.

■ ఆకట్టుకున్న హనుమద్వైభవ ప్రవచనం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో శ్రీ చిట్టి పిళ్లారయ్యస్వామి దశమ వార్షికోత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరాయి. తెనాలికి చెందిన డాక్టర్ నోరి నారాయణమూర్తి చేసిన హనుమద్వైభవము అనే అంశంపై చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం శ్రీ గణపతి పూజ, స్వామివారికి సహస్ర కలశ గోక్షీరాభిషేకం, సహస్ర మోదక గణపతి హోమము అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సువాసినులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ లలితా సహస్రనామ పారాయణ చేశారు. మధ్యహ్నం పూర్ణాహుతి చేసిన అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

■ దేవస్థానంలో బహిరంగ వేలం వాయిదా

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన సీల్డ్ టెండర్స్‌కు వివిధ కేటగిరీలలో లైసెన్సు పొందుటకు ఔత్సాహికులు ముందుకురానందున వాయిదా వేసినట్లు డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. మోపిదేవి ఆల య ప్రాంగణంలో మార్చి 21, 2025 నుంచి మార్చి 31, 2026 ఒక సంవత్సరానికి శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. వాహనాల పార్కింగ్ రుసుము లైసెన్సు హక్కునకు దరావత్తు ఒక్కరే చెల్లిండంతో పోటీ లేక వాయిదా వేసినట్లు, యాత్రికులు వస్తుసామగ్రి, సెల్‌పోన్లు భద్రపరిచే (క్లోక్ రూము) లెసెన్సు హక్కునకు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనకపోవడంతో వాయిదా వేసినట్లు డెప్యూటీ కమిషనర్ వివరించారు. ఎకలేశ్వరస్వామివారి ఆలయ ఈవో జోగి ప్రవీణ, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారా యణ, అధికారులు పాల్గొన్నారు.

■ అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ

ఘంటసాల: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సహకారంతో గ్రామీణ యువతకు అలంకరణ చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా గ్రామీణ యువత నైపుణ్యం అలవర్చుకుని తక్కువ పెట్టుబడితో రోజు వారీ పనులకు ఆటంకం లేకుండా అదనపు ఆదాయం పొందడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ మంచినీటి, సముద్ర నీటి వనరులలో లభించే అలంకరణ చేపల రకాలు తెలిపారు. ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజీ టీచింగ్ అసిస్టెంట్ ప్రవల్లిక, శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్, డాక్టర్ కృష్ణవేణి, యువత పాల్గొన్నారు.

■ శానిటేషన్‌పై శ్రద్ధ తీసుకోవాలి

కృత్తివెన్ను: గ్రామాలలో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు అన్నారు. నెలలో మూడవ శనివారం ప్రత్యేక శానిటేషన్‌లో భాగంగా గ్రామాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వీటితో పాటు నిత్యం శానిటేషన్‌పై సరైన ప్రణాళికతో తడిచెత్త, పొడిచెత్త సేకరణ, దోమల నిర్మూలనకు మందులు పిచికారీ తదితర పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

■ క్రీడాకారులకు షిన్‌గార్డ్స్ బహూకరణ

గూడూరు: స్థానిక జెడ్పీ హైస్కూలు హాకీ క్రీడాకారులకు షిన్ గార్డ్స్ ఆర్‌ఆర్ హాకీ క్లబ్ కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలో హాకీ అభివృద్ధికి ఆర్‌ఆర్ హాకీ క్లబ్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. క్రీడాకారులు మెరుగైన నైపుణ్యాలతో జాతీయ క్రీడ అయిన హాకీలో పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ మత్తి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఆవరణలో కొలతల సేకరణ



మాట్లాడుతున్న ఎంఈవో దుర్గాసాగర్

మోపిదేవి: స్థానిక ఆశ్రమ పాఠశాల వసతి గృహం ఆవరణ మెరకు చేసేందుకు శనివారం కొలతలు సేకరించినట్లు ఎంఈవో దుర్గాసాగర్ తెలిపారు. గత జనవరి 6వ తేదీ వసతిగృహాన్ని సందర్శించిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు స్థానికులు స్థలం మెరక అవసరాన్ని వివరించారు. మెరక చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయినా పనులు చేపట్టక పోవడంతో మరోసారి మీకోసంలో తహసీల్దార్‌కు కోసూరు రామాంజనేయులు వినతి పత్రం అందజేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు కొలతలు సేకరించారు. పంచాయతీరాజ్ డీఈ సురేష్‌బాబు సూచనల మేరకు కోసూరువారిపాలెం గ్రామ సచివాయ సర్వేయర్ గిరిధర్ పల్లంగా ఉన్న స్థలం పొడవు, వెడల్పు, ఎత్తు కొలతలు తీసి డీఈకి పంపినట్లు ఎంఈవో వివరించారు.

ఉద్యోగాలకు 41 మంది ఎంపిక



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీ వాసవి పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికలలో 41 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన రిసల్యూట్, రేడియెంట్, యాక్సియోమ్ కంపెనీల ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. ఈ ఎంపికలో 41 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్లు దొసపాటి బాబా, తమ్మన సాయి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారన్నారు.

అదనపు బస్సు సర్వీసులు



కోడూరు: మచిలీపట్నం నుంచి ఉల్లిపాలెం మీదగా కోడూరుకు ప్రతి రోజు నాలుగు బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు బందరు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు. నెల రోజుల కిందట ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడేలా బస్సు సర్వీసును డిపో అధికారులు ప్రారంభించారు. మిగిలిన సమయంలో ఉల్లిపాలెం మీదగా బస్సు సర్వీసు లేకపోవడంతో మండల ప్రజలు అవనిగడ్డ, చల్లపల్లి మీదగా సుమారు 25 కిలోమీటర్ల అదనపు దూరం ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. దీంతో సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి మరో రెండు సర్వీసులను నడిపేందుకు అంగీకరించారు. మచిలీపట్నం నుంచి ఉల్లిపాలెం మీదగా కోడూరుకు ఉదయం 6 గంటలకు, 9.15 గంటలకు, మధ్యాహ్నం 12.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సు సర్వీసులను నడపనున్నట్లు డిపో అధికారులు తెలిపారు. కోడూరు నుంచి మచిలీపట్నంకు ఉదయం 7.40 గంటలకు, 10.50 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 6.40 గంటలకు బస్సు సర్వీసు ఉంటుందని ప్రకటించారు.